క్లుప్తంగా

పాలస్తీనాలో శాంతి నెలకొనాలని..



తెనాలి: పాలస్తీనాలో యుద్ధం నిలిచిపోయి, శాంతి నెలకొనాలని కోరుకుంటూ పట్టణంలోని ముస్లింలు పార్టీలకతీతంగా కలసికట్టుగా దువా చేశారు. శుక్రవారం మధ్యాహ్నం నమాజు ముగిసిన తదుపరి పట్టణ పరిధిలోని 21 మసీదుల నుంచి ఇమామ్‌లు, మౌజాన్‌లో గోల్డ్ రహిమా ఆధ్వర్యంలో వహాబ్‌చౌక్ సెంటర్‌కు చేరుకున్నారు. మదీనా మసీదు ఇమామ్ ముఫ్తీ ఉస్మాన్ సాహెబ్ ఆధ్వర్యంలో దువా చేశారు. పాలస్తీనాలో బాంబుల దాడిలో చనిపోయిన వృద్ధులు, మహిళలు, చిన్నారుల ఆత్మకు శాంతి కలగాలని, యుద్ధం నిలిచిపోయి ప్రపంచ శాంతి, సర్వమానవ శ్రేయస్సుకు మార్గం సుగమం కావాలని కోరుతూ ఈ ప్రార్థన చేసినట్టు గోల్డ్ రహిమా చెప్పారు. డాక్టర్ రియాజ్‌ఖాన్, వార్డు కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, అన్సారీ, కో-ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభాని, మహమ్మద్ ఖుద్దూస్, జాకీర్ హుస్సేన్, షేక్ మీరావలి, రాష్ట్ర ఇమామే మజ్లిస్ వ్యవస్థాపకుడు షేక్ ఫరీద్, ఖజూర్ సుభాని, షేక్ నాసర్, జామియా మసీదు ముతవల్లి సుభాని, హీరా మసీద్ ముతవల్లి నన్నే భాయ్, ముఫ్తీ తాజుద్దీన్‌ఖాన్ సబీలీ, జాని, జిలాని, షేక్ బాషా, వలి తదితరులు పాల్గొన్నారు.

శుక్రవారాన్ని డ్రై డేగా పాటించాలి

తెనాలిఅర్బన్: ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. తెనాలి పురపాలక సంఘం, మలేరియా విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం దోమల నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. సీజన్ వ్యాధుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం, మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి రాజు నాయక్, సీహెచ్.ప్రభాకర్‌రెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, సూపర్ వైజర్ దీపాల శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు, నవీన్, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఐఎంఏ తెనాలి అధ్యక్షురాలిగా విజయలక్ష్మి



తెనాలిఅర్బన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ అధ్యక్షురాలిగా డాక్టర్ జె.విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ వి.పావని ప్రియాంక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బోసు రోడ్డులోని ఐఎంఏ కార్యాలయంలో శుక్రవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఎ.అనిల్ కుమార్, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ జి.మధు ప్రభాకర్‌బాబు, ట్రెజరర్‌గా డాక్టర్ కె.శ్యామ్‌ప్రసాద్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి, డాక్టర్ వేమూరి శేషగిరిరావు తెలిపారు. ఎన్నికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. అనంతరం వారిని అభినందించారు.

నిరుద్యోగులు మోసపోవద్దు

తెనాలిఅర్బన్: తపాలా శాఖలో గ్రామీణ డాక్ సేవక్ నియామకాలను ఆన్‌లైన్ ద్వారా పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ జె.ప్రసూనరెడ్డి శుక్రవారం తెలిపారు. జీడీఎస్ పోస్టుల్లో కొందరూ నకిలీ కాల్ లెటర్స్ పంపి అభ్యర్థులను మోసగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి వాటిని నమ్మొద్దని హెచ్చరించారు. సందేహాలుంటే కొత్తపేటలోని తెనాలి డివిజన్ సూపరింటెండెంట్ కార్యాలయంలో సంప్రదించాలని వివరించారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

తెనాలిఅర్బన్: పట్టణంలోని ఆరోవ వార్డు ఆలపాటి వెంకటప్పయ్య వీధిలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డుకు కౌన్సిలర్ కొత్రపాటి లక్ష్మి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏఈ రాజఫణీంద్ర మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద రోడ్డు నిర్మాణానికి రూ.11.60 లక్షలు వెచ్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మద్యం తాగుతున్న ఆరుగురిపై కేసు నమోదు

తెనాలిఅర్బన్: బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిపై తెనాలి తాలూకా పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెదరావూరు గ్రామ శివారులోని సుగాలీ తండా సమీపంలో ఆరుగురు బహిరంగంగా మద్యం సేవిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. బహిరంగంగా ఎవరూ మద్యం సేవించినా.. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చదువుల తల్లి సరస్వతీదేవి నమోస్తుతే..

- ఘనంగా దేవి శరన్నవరాత్రి వేడుకలు
- భక్తులకు సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవార్లు
- సంగమేశ్వర ఆలయంలో స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే శివకుమార్



రామలింగేశ్వరపేట శివాలయంలో అమ్మవారికి సరస్వతీదేవి అలంకరణ



సంగమేశ్వరస్వామికి పట్టువస్త్రాలు తీసుకువెళ్తున్న ఎమ్మెల్యే శివకుమార్



మారీసుపేట శివాలయంలో సరస్వతీ అలంకారం

తెనాలిటౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రూరల్ మండలం సంగంజాగర్లమూడిలోని బాలత్రిపుర సుందరీ సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి శుక్రవారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో తెనాలి మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, ఏఎస్ఎన్ కళాశాల డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్, వైఎస్సార్‌సీపీ నాయకులు, అర్చకులు పాల్గొన్నారు.

■ పట్టణ దేవిచౌక్‌లోని రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారు భక్తులకు మహా సరస్వతీ అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయాన్ని తెనాలి డీఎస్పీ జనార్దనరావు సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు డీఎస్పీని ఘనంగా సత్కరించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. గంగానమ్మపేటలోని శ్రీ విద్యాపీఠంలో పూజ్యశ్రీ బాలస్వామిజీ ఆధ్వర్యంలో దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారిని వివిధ రకాల పూలతో సరస్వతీదేవిగా అలంకరణ చేశారు. కార్యక్రమంలో సాలిగ్రామ మఠం సభ్యులు ఎం.రమణయ్య, నాగేశ్వరరావు, జయలక్ష్మి మాతృమండలి, లలితా సేవాసమితి, విద్యాపీఠం సభ్యులు పాల్గొన్నారు.

■ మారీసుపేటలోని శివాలయంలో అమ్మవారు భక్తులకు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు జరిపారు. బోసు రోడ్డులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరణ చేశారు. రాజేశ్వరి దేవి భక్తులకు శ్రీ రాజమాతంగిదేవిగా దర్శనమిచ్చారు. రామలింగేశ్వరపేట శివాలయంలో శ్రీ సరస్వతీ అలంకరంలో భక్తులకు దర్శనమిచ్చారు.

పలు ఆలయాల్లో హోమాలు

తెనాలిటౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని పలు ఆలయాల్లో శుక్రవారం హోమాలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. గంగానమ్మపేటలోని శ్రీ రామేశ్వరస్వామి దేవస్థానంలో నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా అమ్మవారికి చండీ హోమం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వీవీ రమణకుమారి, అర్చకులు వీవీ సురేష్, కృష్ణ హోమంలో పాల్గొని పూజలు జరిపారు. హోమం నిర్వహణ కార్యక్రమాన్ని గోపరాజు హేమంత్ నిర్వహించారు. అయ్యప్పస్వాములు, శివస్వాములు, ఆలయ ధర్మకర్తలు ఎస్‌బీ శివ, కె.భాస్కరరావు పాల్గొన్నారు. గంగానమ్మపేటలోని వేణుగోపాలస్వామి దేవస్థానం, శ్రీ గోవర్ధనస్వామి దేవస్థానంలో దసరా నవరాత్రులు సందర్భంగా మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవార్లకు కుంకుమ పూజలు జరిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మల్లీశ్వరి ఆధ్వర్యంలో వంశ పారంపర్య అర్చకులు రఘు, మాధవ హోమం జరిపారు. కొత్తపేటలోని అష్టలక్ష్మి ఆలయంలో అమ్మవారిని ధనలక్ష్మి అలంకరణ చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేశారు. రూరల్ మండలం నంది వెలుగులోని కనకదుర్గా అమ్మవారి ఆలయంలో అమ్మవారిని సరస్వతీ దేవి అలంకరణ చేశారు. చిన్నారులకు ఆలయ అర్చకులు వాసుబాబు ఆధ్వర్యంలో అర్చకులు సుమారు 50మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.



అష్టలక్ష్మి ఆలయంలో ధనలక్ష్మీ అలంకరణలో అమ్మవారు



శ్రీ విద్యాపీఠంలో కాగిత పూలతో సరస్వతీదేవి అలంకారం



నందివెలుగు కనకదుర్గ ఆలయంలో అక్షరాభ్యాసం



రామేశ్వరస్వామి ఆలయంలో చండీ హోమం

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదల ఆరోగ్యానికి రక్ష

ఎమ్మెల్యే శివకుమార్



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదల ఆరోగ్యానికి భరోసా కలుగుతోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. సాలీపేటలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. స్పెషలిస్ట్ వైద్యులు రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ పేద ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌లో జనరల్ 81, డెర్మాటాలజీ 63, ఫిజిషియన్ 34, ఆప్తామాలజీ 116 మంది వైద్య సేవలు పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ ఎం.జశ్వంతరావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మద్దాళి శేషాచలం, వైఎస్సార్ సీపీ నాయకులు భాస్కర్, కాళిదాసు వెంకట సత్యం, బూరెల దుర్గా ప్రసాద్, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి రాజ్ నాయక్, సీహెచ్.ప్రభాకర్‌రెడ్డి, అందె బాలచంద్రమౌళి పాల్గొన్నారు.

తెనాలి ప్రాంతానికి మంచి పేరు తీసుకురండి

డీఎస్పీ జనార్దనరావు



నగదు బహుమతి అందజేస్తున్న డీఎస్పీ

తెనాలిఅర్బన్: కూచిపూడి నృత్యం ప్రదర్శనలో గ్రీష్మ శ్రీ , తహసీన్‌లు మంచి ప్రతిభ కనబరుస్తూ తెనాలి ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని డీఎస్పీ జనార్దనరావు పేర్కొన్నారు. కుమార్ పంప్స్ ఆధ్వర్యంలో సుల్తానా బాద్‌లోని సంస్థ కార్యాలయలలో గ్రీష్మ శ్రీ, తహసీన్‌ల అభినందన సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి చిన్న వయస్సులో కూచిపూడి నృత్య ప్రదర్శనలిస్తూ.. గవర్నర్ ప్రసంశలు పొందడం అభినందనీయమన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు, జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి మాట్లాడుతూ కళల కాణాచి తెనాలిలో పుట్టిన వీరు నృత్య ప్రదర్శనల ద్వారా అంతర్జాతీయ స్థాయిలో మంచి పేరు తెచ్చుకోవాలని అభిలాషించారు. కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రమణ్యం మాట్లాడుతూ పిల్లల అభిరుచి మేరకు తల్లిదండ్రులు వ్యవహరిస్తే ఫలితాలు కళ్ల ముందు కనపడుతున్నట్లు ఉంటాయన్నారు. చిన్నారులను తీర్చిదిద్దుతున్న గురువులకు కృతజ్ఞతలు తెలియజేశారు. చిన్నారులతో పాటు నాట్య గురువు నిర్మల రమేష్‌ను సత్కరించారు. అనంతరం ఒక్కొక్కరికి రూ.6,116లు నగదు బహుమతిని కుమార్ పంప్స్ యాజమాన్యం అందజేసింది. సమావేశానికి మా ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్ రాజా అధ్యక్షత వహించగా కృష్ణారెడ్డి, మిలటరీ ప్రసాద్, బెల్లంకొండ వెంకట్, అరుణకుమారి, ఆలీయా పాల్గొన్నారు.

అట్టహాసంగా పద్య నాటక పోటీలు



వసంత రాజీయం పద్యనాటకంలో సన్నివేశం



ఇంపోస్టర్స్ సాంఘిక నాటకంలో సన్నివేశం

- వేడుకగా కళల కాణాచి వీణా అవార్డ్స్-2023

తెనాలి: కళల కాణాచి-తెనాలి, వేద గంగోత్రి ఫౌండేషన్-విజయవాడ సంయుక్త నిర్వహణలో వీణా అవార్డ్స్ తృతీయ జాతీయ పద్య నాటక/ సాంఘిక నాటికల పోటీలు-2023 శుక్రవారం తెనాలిలో ఘనంగా ప్రారంభించారు. కొత్త పేటలోని తెనాలి రామకృష్ణకవి కళా క్షేత్రంలో ఉదయం ప్రముఖ రంగస్థల నటీమణి జయలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేశారు. తొలిరోజు రెండు పద్య నాటకాలు, ఒక సాంఘిక నాటిక, ప్రత్యేక ప్రదర్శన మరో సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. ప్రదర్శనలన్నీ ప్రేక్షకుల అభినందనలు అందుకున్నాయి. తొలిగా శ్రీ కళానికేతన్, హైదరాబాద్ వారి 'వసంత రాజీయం'చారిత్రక పద్య నాటకాన్ని ప్రదర్శించారు. కొండవీడును పరిపాలించిన వేమగిరి కుమారగిరి రెడ్డి సుపరిపాలకుడు. సంగీత సాహిత్యాల్లో దిట్ట. ఏటా కొండవీడులో వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తూ కర్పూర వసంతరాయలుగా బిరుదును పొందుతాడు. తడకమళ్ల రామచంద్రరావు రచించిన ఈ నాటకానికి మారంరాజు రామచంద్రరావు దర్శకత్వం వహించారు. కుమారగిరి రెడ్డిగా సోమ అంజిరెడ్డి, లకుమాదేవిగా డాక్టర శ్రీజ సాదినేని, నాట్యగురువుగా ఎం.సాళ్వాచారి పాత్రోచితంగా నటించారు. సంగీతం-ఎం.రామలింగయ్య, సెట్టింగ్, లైటింగ్: సురభి సంతోష్.

రెండో ప్రదర్శనగా ఉషోదయ నాట్య మండలి, చెరుకుపల్లి వారి 'మోహినీ భస్మాసుర' పద్య నాటకాన్ని ప్రదర్శించారు. దుష్టులకు వరాలిస్తే ఎలాంటి అనర్థాలు జరుగుతాయనే పురాణగాథ ఇది. తెనాలికే చెందిన స్వర్గీయ మద్దెల పంచానదం రచించిన నాటకానికి దిట్టకవి తిరువెంగళబాబు దర్శకత్వం వహించారు. భస్మాసురుడిగా మొగిలిపువ్వు వెంకట సుబ్బయ్య, మోహినిగా షేక్ తిరుమలబీ, మహావిష్ణువుగా కొప్పరపు శ్రీనివాసరావు నటించారు. సంగీతం: సీహెచ్ శ్రీనివాసరావు, రంగాలంకరణ: ఎం.సుబ్బారావు. చివరగా చైతన్య కళాభారతి, కరీంనగర్ వారి 'స్వప్నం రాల్చిన అమృతం' సాంఘిక నాటికను ప్రదర్శించారు. పీఎస్ నారాయణ మూలకథకు పరమాత్ముని శివరాం నాటకీకరణ చేయగా, రమేష్ మంచాల దర్శకత్వం వహించారు. భార్యాభర్తల అనుబంధం ఇతివృత్తంగా సాగింది. ప్రత్యేక ప్రదర్శనగా మిత్ర క్రియేషన్స్, హైదరాబాద్ వారి సాంఘిక నాటకం 'ఇంపోస్టర్స్' ప్రదర్శించారు. ఆకురాతి భాస్కరచంద్ర రచనకు ఎస్ఎం బాషా దర్శకత్వం వహించారు.

అభివృద్ధికి అందరూ సహకరించాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీపీ రమాదేవి

తెనాలిటౌన్: మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తెనాలి ఇన్‌చార్జ్ ఎంపీపీ గోపిశెట్టి రమాదేవి అన్నారు. కొత్తపేటలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి రమాదేవి అధ్యక్షత వహించారు. సమావేశంలో 2023-24 సంవత్సర సవరణ బడ్జెట్ వివరాలను కార్యాలయ ఏవో ప్రతాపరెడ్డి చదివారు. కొలకలూరు ఎంపీటీసీ కాలిశెట్టి ఫణికుమార్ మాట్లాడుతూ గ్రామంలో ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. సర్వేపూర్తయితే.. ఆక్రమణలు తొలగిస్తామని ఆర్అండ్‌బీ ఏఈ సుమన్ సైమన్ పాల్ సమాధానం ఇచ్చారు. నంది వెలుగు రోడ్డులో నీరు నిలబడకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ తిన్నలూరి విజయలక్ష్మి కోరారు. ఎంపీడీఓ విజయలక్ష్మణ్ మాట్లాడారు. గతంలో ఆమోదించిన కొన్ని పనులను మంజూరు చేశామని, మరి కొన్ని పనులకు ప్రతిపాదనలు ఇవ్వాలని ఎంపీటీసీ సభ్యులను కోరారు. ఎంఈఓ మేకల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకన్నా.. గుడ్లు ఎక్కువగా వస్తున్నాయని వాటిని ప్రజా ప్రతినిధులు పరిశీలించి రిజిస్టర్‌లో నమోదు చేయాలని కోరారు. సమావేశంలో మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంఈవో-2 జయంత్‌బాబు, సీడీపీఓ ఎం.సునీత, పీఆర్ ఏఈ వెంకటేశ్వరరావు, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుధాకర్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

